రైతుల స్థానంలో దళారులు

- టీడీపీ నేతల కనుసన్నల్లో పాయకాపురం రైతు బజారు
- రైతుబజారుకు కూరగాయలు సరఫరా చేస్తున్న టీడీపీ నాయకులు
- నాణ్యత లేకున్నా కొనక తప్పడం లేదంటున్న వ్యాపారులు
- మామూళ్ల మత్తులో మార్కెటింగ్ శాఖ


పాయకాపురం రైతుబజారులో అడ్డదిడ్డంగా దుకాణాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం రైతు బజార్ టీడీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నియోజకవర్గ అధినాయకుని అనుచరులు చెప్పిందే వేదవాక్కుగా స్టాల్స్ కేటయింపులు జరుగుతున్నాయి. అప్పటి వరకు షాపులు నిర్వహించిన వారికి అధికారులు నిబంధనల పేరుతో ఉద్వాసన పలుకుతున్నారు. రైతులకు రెన్యువల్స్ చేయకుండా అధికార పార్టీ నాయకులు ముడుపులు తీసుకొని కొత్త వారికి కేటాయిస్తున్నారు. వాటిల్లో అధికారులకు మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతులు ఉండాల్సిన స్టాల్స్‌లో దళారులు, వారి బినామీలు కూరగాయలు విక్రయిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒకే వ్యక్తికి నాలుగు స్టాల్స్

మార్కెటింగ్ శాఖ రికార్డుల ప్రకారం 54 మంది రైతులు తాము పండించిన కూరగాయలను, ఆకుకూరలను పాయకాపురం రైతు బజారులో విక్రయిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి వారి స్థానంలో దళారులు స్టాల్స్‌లో నెలల తరబడి వ్యాపారాలు చేసుకొంటూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఒకే వ్యక్తి నాలుగు స్టాల్స్ నిర్వహిస్తూ వచ్చిన లాభాల్లో అధికారులకు, పార్టీ నాయకులకు వాటాలు పంచుతుండటం విశేషం.

డ్వాక్రా గ్రూపు స్టాల్స్‌లోనూ..

డ్వాక్రా గ్రూపులకు 10 స్టాల్స్ కేటాయించాల్సి ఉండగా వాటిలో కూడా అధికార పార్టీ నాయకులే తమ వారిని పెట్టి వ్యాపారం చేస్తున్నారు. సొసైటీల ద్వారా నిర్వహించాల్సిన స్టాల్స్‌ను లీజుకిచ్చి రోజువారీ అద్దె వసూళ్లకు పాల్పడుతున్నారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా అనుమతులు..

పాయకాపురం రైతు బజార్‌లో ఉండాల్సిన 54 స్టాల్స్‌కు గాను కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం 80 షాపులకు మార్కెటింగ్ శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఎక్కడ పడితే అక్కడ ఇష్టం వచ్చినట్లు ప్లాస్టిక్ పరదాలు కట్టి దుకాణాలను నడుపుతున్నారు. వినియోగదారులు రైతుబజారులోకి అడుగుతీసి అడుగు పెట్టే స్థలం లేదు. ఆ షాపులన్నింటికీ అధికార పార్టీ నాయకులు సరఫరా చేసే కూరగాయలను మాత్రమే రైతుబజారు స్టాల్స్‌లో విక్రయిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నుంచి ఎంజీపీ వ్యాపార సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి రోజూ టమోటాలు, బంగాళాదుంపలు, పలు రకాలు కూరగాయలు రైతు బజారు స్టాల్స్‌కు సరఫరా అవుతున్నాయి. స్టాల్స్ నిర్వహించే వారు వాటినే కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. నాణ్యత లేకపోయినా వాటిని విక్రయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో, రైతుబజార్‌లో కూరగాయల ధరలు ఒకే విధంగా ఉండటంతో వినియోగదారులు రైతుబజారుకు రావడానికి ఆసక్తి చూపడం లేదు.


రైతు బజార్ ఆవరణలో పడవేసిన వ్యర్థాలు

ధరలు అందుబాటులో లేవు



రైతు బజారులో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సామాన్యులకు ధరలు అందుబాటులో లేవు. కిలో దొండకాయ రూ.16, దోసకాయలు రూ. 18, బీరకాయలు రూ. 28, గోరుచిక్కుడు రూ. 28, బెండ రూ. 18 కి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– కె. సాయి, ప్రకాష్ నగర్

అధికారి అందుబాటులో ఉండడం లేదు



రైతు బజార్‌లో నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తున్నారని చెప్పడానికి ఆఫీసుకు వెళితే అధికారి అందుబాటులో లేరు. ఫోను చేస్తే సమాధానం ఉండటం లేదు. రైతు బజార్‌లో సిటిజన్ చార్టర్ అమలు చేయాలి.

– డి.చిన్నిబాబు, రాజీవ్‌నగర్

నాసిరకం కూరగాయల విక్రయాలు

ఆదివారం వస్తే పాయకాపురం రైతు బజార్‌లో పండగ వాతావరణం నెలకొంటోంది. నున్న, సూరంపల్లి, అడవినెక్కలం, కొండపావులూరు ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పని చేసే బిహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారు ట్రాక్టర్లపై వచ్చి వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. అదే రోజూ నాణ్యత లేని సరుకు కూడా అమ్ముతుంటారు. రైతుబజార్‌లో ముఠా కూలీల రేట్లు నిర్ణయించడంలో కూడా అధికార పార్టీ నాయకులే కీలకంగా వ్యవహరిస్తున్నారంటే పాలకుల కనుసన్నల్లోనే రైతుబజారు నడుస్తోందని చెప్పక తప్పడం లేదు.

క్లుప్తంగా

సైనికులకు బీబీఏ అభినందన



విజయవాడలీగల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడిచేసిన వీరజవాన్లకు, ఆపరేషన్‌కు నాయకత్వం వహించిన వీర మహిళామణులకు బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా అభినందనలు తెలిపారు. బుధవారం బీబీఏ ప్రాంగణంలో బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, సీనియర్ న్యాయవాదులు వి.రాంప్రసాద్, పిళ్లా రవి, అబ్దుల్ మతీన్, ఇతర న్యాయవాదులతో కలిసి గవర్నింగ్ బాడీ సభ్యులు వీరజవాన్లకు అభినందనలు తెలియజేస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

జాతీయ పోటీల్లో సెమీస్‌కి చేరిన రాష్ట్ర కబడ్డీ జట్టు



విజయవాడస్పోర్ట్స్: బిహార్‌లోని రాజ్ గిరీలో జరుగుతున్న ఖేలో ఇండియా జాతీయ యూత్ గేమ్స్‌లో రాష్ట్ర కబడ్డీ అండర్–18 బాలుర జట్టు సత్తా చాటింది. ఈ నెల రెండున ప్రారంభమైన ఈ పోటీల్లో పూల్ ఎ నుంచి ఏపీ జట్టు బరిలోకి దిగింది. అదే పూల్‌లోని చత్తీస్‌ఘడ్, కర్ణాటక జట్లను ఓడించింది. మరో జట్టు హర్యానాపై ఓడి పూల్ రన్నర్‌గా నిలిచి సెమిస్ లోకి ప్రవేశించి పతకం ఖరారు చేసుకుంది. సెమీస్‌లో మహారాష్ట్రతో తలపడుతుంది. జట్టులోని క్రీడాకారులు విజయవాడ రైల్వేస్టేషన్‌లోని స్పై అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ప్రతిష్టాత్మకమైన పోటీల్లో సెమీస్‌కు చేరిన జట్టును ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.


విజయవాడ బ్రాండ్ ఇమేజ్ టైటిల్ ఎంపిక కమిటీ నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అమరావతి రాజధానికి గేట్‌వే నగరమైన విజయవాడకు గుర్తింపు తెచ్చేందుకు నిర్వహిస్తున్న పోటీలలో విజయవాడ బ్రాండ్ ఇమేజ్ టైటిల్ ఎంపికకు కమిటీని నియమించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 వరకు ఔత్సాహికులు తమ బ్రాండ్ టైటిల్, ట్యాగ్‌లైన్ ఎంట్రీలను పంపేందుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు 250 ఎంట్రీలు అందాయని చెప్పారు. ఈ నెల 10 వరకు వచ్చిన ఎంట్రీలను క్షుణ్ణంగా పరిశీలించి, బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించామన్నారు. కమిటీలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చైర్మన్‌గా, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి సభ్య కన్వీనర్‌గా, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా టూరిజం అధికారి, ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్‌లను సభ్యులుగా నియమించామని వివరించారు.

మైత్రి యాడ్స్‌పై బాధితుల ఫిర్యాదు

పటమట(విజయవాడతూర్పు): మాకు లక్ష డిపాజిట్ చేయండి.. మీకు నెలకు రూ. 12 వేలు ఇస్తామని ఓ కంపెనీ సామాన్యులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఎనికేపాడు శివాలయం వీధిలోని జిన్నా మార్కెటింగ్ కంపెనీకి చెందిన మైత్రి యాడ్స్ స్కీంకు డబ్బులు కడితే రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపడంతో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన ముగ్గురు కలిసి రూ. 3.66 లక్షలు కట్టి మోసపోయారు. మొదటి నెల సంబంధిత కంపెనీ రూ.12 వేలు చెల్లించి ఆ తర్వాత నుంచి చెల్లింపులు ఆపేసింది. రెండేళ్లు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వీరవల్లి గ్రామానికి చెందిన దిండి సుబ్బారావు, అతని భార్య దిండి రంగమ్మ, అత్తయ్య రెడ్డి రమణమ్మ విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదికలో, పటమట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా గుంత



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే బీఆర్టీఎస్ రోడ్డు నుంచి బాబూరావు మేడ సెంటర్ మలుపు రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇక్కడ వాహనాల రద్దీ వల్ల ఓపెన్ డ్రెయిన్‌పై చప్టా కుంగిపోయింది. వేగంగా వచ్చిన వాహన చోదకులు మలుపు తిరిగే క్రమంలో గుంతలో పడి గాయాల పాలవుతున్నారు. ఇక్కడ గుంత రోజురోజుకు పెద్దగా అవ్వటంతో ఎప్పుడు ఎవరు ప్రమాదానికి గురవుతారోనని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చించాలని కోరుతున్నారు.

వాసవీ మాత సేవలో మల్లాది విష్ణు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆర్యవైశ్యుల ఆత్మగౌరవం కాపాడేందుకు అగ్ని ప్రవేశం చేసి ఆత్మార్పణ చేసుకున్న చల్లని తల్లి వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వాసవీ మాత జయంతిని పురస్కరించుకుని సత్యనారాయణపురంలోని కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సనత్, నాదార్స్ శ్రీను, చల్లా సుధాకర్, కొల్లూరు రామకృష్ణ పాల్గొన్నారు.

దేశ రక్షణలో యువత భాగస్వాములు కావాలి



విజయవాడ కల్చరల్: దేశ రక్షణలో యువత భాగస్వాములు కావాలని యువజన నాయకుడు దివ్వెల రాఘవరాజు అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను హతమార్చిన సైనికులకు, దేశ రక్షణ శాఖకు, ప్రధానమంత్రి మోదీకి మద్దతు తెలుపుతూ దేశ భక్తి కలిగిన యువల పర్యవేక్షణలో బుధవారం జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. ఎస్. శివాజీ, అవుటపల్లి శివ ప్రసాద్, కె.పద్మజ, ఆర్ముగతం పాల్గొన్నారు.

రోజువారీ విధుల్లో హిందీ భాష పాత్ర కీలకం

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



టీఓఎల్‌ఐసీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో రోజువారీ విధుల్లో అధికారిక భాష హిందీ కీలక పాత్ర పోషిస్తోందని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. టీఓఎల్ఐసీ (టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ) చైర్మన్ నరేంద్ర ఏ పాటిల్ అధ్యక్షతన విజయవాడ రైల్వే ఆడిటోరియంలో బుధవారం టీఓఎల్ఐసీ సమావేశం జరిగింది. హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ డెప్యూటీ డైరెక్టర్ ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ముందుగా ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, డెప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్యామ్‌సుందర్ సాహుతో కలిసి డీఆర్ఎం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో రోజువారీ విధుల్లో రాజభాష హిందీ అమలు ప్రయత్నాలను ప్రశంసించారు. టీఓఎల్ఐసీ సమావేశాలు, హిందీ పోటీలు రాజభాష అమలు వినియోగాన్ని మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన 'ఆదర్శ్ మండల్ – ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి' అవార్డును సాధించడం పట్ల అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్‌లో రాజభాష అమలును ప్రోత్సహించేలా హిందీ సెమినార్‌లు, స్మారక కార్యక్రమాలు, హిందీ పఖ్వాడ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీఓఎల్ఐసీ పురోగతిపై సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా గత ఫిబ్రవరి 4 నుంచి 18 వరకు జరిగిన హిందీ ఆధారిత పోటీలలో 42 కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి పాల్గొని ప్రతిభ కనపర్చిన 125 మంది అధికారులు, ఉద్యోగులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుంటుపల్లిలోని చీఫ్ వర్క్‌షాపు మేనేజర్ ఎస్.శ్రీనివాస్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఎఫ్‌సీఐ జీఎం విజయ్ కుమార్ యాదవ్, రీజనల్ పాస్‌పోర్టు ఆఫీసర్ శివహర్ష తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సామాజిక తత్వవేత్త వీరబ్రహ్మేంద్రస్వామి


ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్న స్వర్ణకార సంఘం ప్రతినిధులు


భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న శ్రీకాంత్, నిర్వాహకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి గొప్ప కాలజ్ఞాని..సామాజిక తత్వవేత్త అని వైఎస్సార్ సీపీ చేతి వృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ అన్నారు. సింగ్‌నగర్ శాంతినగర్ పోలమ్మ గుడి వీధిలో ముంతా కనకాచారి ఆధ్వర్యంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్వామివారి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు చేశారు. ఆయన మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారు భవిష్యత్, వర్తమాన కాలజ్ఞానాన్ని ప్రజలకు అందించి సన్మార్గాన్ని చూపిన గొప్ప రాజయోగి అని కొనియాడారు. ఆయన తన బోధనలు.. ప్రవచనాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప సామాజికతత్వవేత్త అని వివరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. విజయవాడ విశ్వబ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షులు చిట్టూరి హరీష్, రాష్ట్ర నాయకులు జవ్వాది సుధీర్, మహిళా సంఘం నాయకురాలు ముండూరి సత్యవతి, ప్రసన్న, రమేష్, ముంతా గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన పూజా కార్యక్రమం బుధవారం జరిగింది. గవర్నర్‌పేట దున్నావారి వీధిలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురు దంపతులు పీటలపై కూర్చుని పూజాదికాలు నిర్వహించారు.

అనంతరం బ్రహంగారి ప్రవచనాలు, తాళాబత్తుల జయలక్ష్మి బృందం బ్రహ్మంగారి భజన కార్యక్రమం నిర్వహించారు. కామాక్షి స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కడారు హేమ సుందరం మాట్లాడుతూ 332 సంవత్సరాల కిందట వీరబ్రహ్మేంద్ర స్వామి ఇదే రోజు సజీవ సమాధి అయ్యారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆరాధన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. బ్రహ్మంగారు కాలదర్శనం చేసి భవిష్యత్‌లో జరిగే విషయాలను బోధించారన్నారు. గోల్డ్ క్లస్టర్ చైర్మన్ ధనాలకోట శ్రీనివాసరావు, కామాక్షి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బి. రవీంద్ర, కోశాధికారి అందే బాబి, గొల్లపల్లి భాస్కర రావు, పట్నాల సత్యనారాయణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా గంజాయిని విక్రయిస్తున్న ఓ మహిళను ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. సింగ్‌నగర్ స్మైల్ హాస్పటల్ సమీపంలో ఓ మహిళ గంజాయి విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. విజయవాడ వెస్ట్ సేషన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎస్.శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో సిబ్బంది ఆ ప్రాంతంపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఓ మహిళ స్కూటర్‌పై కూర్చొని అనుమానాస్పదంగా బ్యాగుపెట్టుకొని ఉండడంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా ఆమె వద్ద రెండు కిలోల గంజాయి లభించింది. సదరు మహిళ గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కేఎల్‌రావు నగర్ కాలనీకి చెందిన చదల జ్యోతి(34)గా పోలీసులు గుర్తించారు. ముద్దాయిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపింది.

మజ్జిగ పంపిణీ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పూర్వ విద్యార్థులు కలిసి కట్టుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్ఎన్‌పురం సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. ఏకేటీపీ స్కూల్ 1983–84 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం శివాజీ కేఫ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ లక్ష్మీనారాయణ ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ సౌజన్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి మల్లాది బాల త్రిపుర సుందరమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా బుధవారం బుడమేరు వంతెన సెంటర్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు.



అల్లూరి త్యాగం తెలుగు జాతికి గొప్ప గౌరవం


అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విష్ణు తదితరులు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు


నివాళులర్పిస్తున్న డీసీపీ సరిత

మధురానగర్(విజయవాడసెంట్రల్): గిరిజన హక్కుల కోసం పోరాడి, వారిలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం తెలుగు జాతికి గొప్ప గౌరవమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బుడమేరు వంతెన వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విష్ణు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో అల్లూరి జరిపిన పోరాటం ఓ ప్రత్యేక అధ్యాయమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేసిన ఆ మహనీయుని నుంచి యువత స్ఫూర్తి పొందాలన్నారు. అల్లూరి ఆశయాలే ఆదర్శంగా గిరిజన సంక్షేమానికి గత ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని చెప్పారు. అల్లూరి పేరిట నూతన జిల్లా ఏర్పాటు ఓ చారిత్రాత్మక నిర్ణయమన్నారు. లంబసింగిలో అల్లూరి మ్యూజియం ఏర్పాటుకు 22 ఎకరాలను గత ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. అల్లూరి స్ఫూర్తితో వివక్షలకు తావులేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అదే మనం అందించే నిజమైన నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మురళీ కృష్ణంరాజు, పట్టాభి రామరాజు, చల్లా సుధాకర్, శ్యామ్, కృష్ణయ్య, దుర్గారావు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ముత్యాలంపాడులో శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటం, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమా, మాజీ డెప్యూటీ మేయర్ సామంత పూడి నరసరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు, కార్యదర్శి దాట్ల భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడస్పోర్ట్స్: ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని తీసుకువచ్చి స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు పోరాడి ప్రాణాలర్పించారని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) కేకేజీవీ సరిత అన్నారు. స్థానిక కమిషనర్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో పనిచేసే ప్రతి ఒక్కరు అల్లూరి సేవా తత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి హక్కులను కాపాడే విధంగా పని చేయాలని సూచించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

277 మందికి రూ.9.91 లక్షల జరిమానా


మాట్లాడుతున్న ఈఈ విజయకుమారి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై చర్యలు తప్పవని డీపీఈ(విజిలెన్స్) ఈఈ పి.విజయకుమారి హెచ్చరించారు. విద్యుత్ శాఖ విజిలెన్స్, విజయవాడ పట్టణం ఆపరేషన్ విభాగం ఎన్టీఆర్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్లు ఎం.సాంబశివరావు, బి.విజయకృష్ణ ఆధ్వర్యంలో అజిత్‌సింగ్‌నగర్ సెక్షన్‌లో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీపీఈ (విజిలెన్స్) ఈఈ పి.విజయకుమారి, ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు నేతృత్వంలో మొత్తం 25 మంది అధికారులు, 102 మంది సిబ్బంది 50 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. అనుమతికి మించి అధిక లోడు వాడుకుంటున్న 271 మందికి రూ.9.16 లక్షలు, ఇచ్చిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ముగ్గురికి రూ.35 వేలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా వస్తున్న మూడు సర్వీసులను గుర్తించి రూ.40 వేలు.. మొత్తం 277 మంది వినియోగదారులకు రూ. 9.91 లక్షలు అపరాధ రుసుం విధించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే భారీగా జరిమానాలు అనంతరం సింగ్‌నగర్ షాదీఖానాలో జరిగిన సమావేశంలో ఈఈలు పి.విజయకుమారి, రవీంద్రబాబులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడడం చట్టరీత్యానేరమని, మొదటిసారి చేసిన తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందని, రెండోసారి తప్పు చేసినట్లు గుర్తిస్తే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు కూడా పంపుతారని వివరించారు.

ప్రకృతి వ్యవసాయ ఫలితాలు అద్భుతం

ఉయ్యూరురూరల్: ప్రకృతి వ్యవసాయ ఫలితాలు అద్భుతం అని, అందులో మహిళల పాత్ర అమోఘమని జపాన్ బృందం సభ్యులు ప్రశంసించారు. ఉయ్యూరు మండలం బోళ్లపాడులో నిర్వహిస్తున్న ప్రకతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం జర్మన్ ప్రభుత్వ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జర్మన్‌కు చెందిన బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూఎఫ్ దక్షిణ ఆసియా డైరెక్టర్ కారోలిన్ గన్సార్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి పరిచేందుకు జర్మన్ ప్రభుత్వం కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కేఎఫ్‌డబ్ల్యూ ఇండియా ఆఫీస్ డైరెక్టర్ ఒల్ఫ్ ముత్తు, నేచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ సీనియర్ సెక్టార్ స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్‌తో కూడిన బృందం గ్రామంలో విస్తృతంగా పర్యటించింది. సి.మోహన్‌రావుకు చెందిన వ్యవసాయ క్షేత్రం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలపై ఏర్పాటు చేసిన చక్రంను పరిశీలించింది. అనంతరం సి.మోహన్ రావు అరటి ఏ గ్రేడ్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రకృతి వ్యవసాయ సూత్రాలను, అనుసరిస్తున్న విధానాలను అరటి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న ఏటీఎం ఎనీ టైం మనీ నమూనాను పరిశీలించారు. పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ


ఆటో డ్రైవర్‌ను అభినందిస్తున్న సీఐ నాగరాజు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆటోలో పోగొట్టుకున్న ఓ ప్రయాణకురాలి బంగారు నగలు ఉన్న బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా చల్లపల్లిలో నివాసం ఉంటున్న నాగెండ్ల ఇందిర తన తండ్రి సంవత్సరికం సందర్భంగా భర్త పట్టా రాజుతో కలిసి మంగళవారం రాత్రి పూర్ణానందంపేటకు బయలుదేరారు. రాత్రి 8.30 గంటలకు బస్టాండ్‌లో దిగి ఆటో మాట్లాడుకుని పూర్ణానందంపేటకు వెళ్లారు. ఆటో దిగి వారితో పాటు తెచ్చుకున్న సుమారు 250 గ్రాముల బంగారు నగలు ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయారు. భవానీపురానికి చెందిన ఆటోడ్రైవర్ కాళ్ల పైడినాయుడు ఆటోలో బ్యాగ్ ఉండడాన్ని గమనించి రాత్రి 10 గంటలకు పోలీసులకు అప్పగించాడు. బ్యాగ్‌లో లభించిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి బాధితురాలికి సమాచారం అందించారు. బంగారు నగల బ్యాగ్‌ను పోలీసులు బుధవారం ఉదయం 10 గంటలకు బాధితురాలికి అందజేశారు. ఆటోలో మర్చిపోయిన బంగారు నగల బ్యాగ్‌ను నిజాయతీగా అప్పగించిన ఆటోడ్రైవర్‌ను సీఐ నాగరాజు సత్కరించి అభినందించారు.